నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
నల్గొండ యాదాద్రి సూర్యాపేట
శుక్రవారం 22, ఆగస్టు 2025 పేజీలు - 8



సీజనల్ వ్యాధుల బారిన పడకుండా...

# చిన్నపిల్లలకు సత్వర చికిత్స అందించాలి

## వ్యాధి నివారణ మందులు ముందే సిద్ధంగా ఉంచుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్గొండ జిల్లా బ్యూరో



సీజనల్ వ్యాధులబారిన పడిన చిన్న పిల్లలకు సత్వర చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. అంతేకాక ఆయా వ్యాధులకు సంబంధించి వ్యాధి నివారణ మందులు ముందే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తల్లిదండ్రులలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. గురువారం ఆమె ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించి చిన్న పిల్లల వార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న చిన్న పిల్లలను పరిశీలించిన అనంతరం వారి వివరాలను ఆసుపత్రి సూపరింటిండెంట్ అరుణ కుమారి, చిన్న పిల్లల విభాగం అధిపతి డాక్టర్ వందన లను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో ముఖ్యంగా జ్వరంతో ఆసుపత్రిలో చేరిన పిల్లలకు సంబంధించి మలేరియా, టైఫాయిడ్ ,డెంగ్యూ కేసుల వివరాలను అడిగారు. సీజనల్ వ్యాధులతో వచ్చిన చిన్న పిల్లలకు తక్షణ చికిత్స అందించాలని,ఇందుకు అవసరమైన మందులు ఎప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ముందు జాగ్రత్తగా ఆసుపత్రిలో ఉన్న మందులు,ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు నగేష్, చంద్రశేఖర్, స్వరూపా రాణి, తదితరులు ఉన్నారు.

# నల్గొండ జిల్లాలో పెరిగిన 1972.926 మెట్రిక్ టన్నులు

- జిల్లాలో 65,276 కొత్త రేషన్ కార్డులు
- లబ్ధిదారులకు సెప్టెంబర్ నుంచి సన్న బియ్యం
- ఫలించబోతున్న 11 ఏళ్ల కల

నల్గొండ జిల్లా బ్యూరో



రేషన్ కార్డుల కోసం 11 ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద ప్రజల కల నెరవేరింది. జులై 14న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించిన విషయం తెలిసిందే. జిల్లాలో లబ్ధిదారులకు రాష్ట్ర మంత్రులు, కలెక్టర్ చేతుల మీదుగా కార్డులు అందించారు. దీంతో వారి మోముల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాల ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్త కార్డుదారులకు సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీకి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. జూన్ మూడు నెలల రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేశారు. దీంతోపాటు మూడు నెలలుగా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు ఉన్న కార్డులలో సభ్యుల పేర్లు నమోదు చేసింది. జిల్లాలో పెరిగిన ఆహార భద్రత కార్డులోని సభ్యుల సంఖ్యకు అనుగుణంగా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు పౌరసరపరల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీకి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 4 లక్షల 53,946 మంది పాత రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులు ఉండగా కొత్తగా 65 276 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి యధావిధిగా పాత కార్డులతో పాటు కొత్త కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు సెప్టెంబర్ కోటకు సంబంధించిన సన్నబియ్యం కేటాయించారు. ఎం.ఎల్.ఎస్. పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలింపునకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం చౌక ధర దుకాణాలు, మండల స్థాయి గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యానికి తోడు అదనంగా కావలసిన కోటాను సరఫరా చేస్తున్నారు.గతంలో 4 లక్షల 53,946 లబ్ధిదారులు ఉండగా కొత్తగా 65, 276 అధికారులకు కార్డులు అందజేశారు. జిల్లాలో 997 రేషన్ షాపుల ద్వారా 10,884.626 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయనున్నారు. కొత్తగా కార్డుదారులకు 1972.926 మెట్రిక్ టన్నుల బియ్యం రానున్నాయి. ఏదేమైనప్పటికీ జిల్లాలో 5 లక్షల 19,222 మంది కార్డుదారులు సెప్టెంబర్ నెలలో సన్న బియ్యం లబ్ధి పొందనున్నారు. ఒకవేళ వీలైతే తెల్ల రేషన్ కార్డులకు ఉచితంగా రేషన్ తో పాటు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పర్యావరణ హితమైన చేతి సంచిని కూడా ఇవ్వాలనే లక్ష్యంతో ఉంది. తెల్ల టి రంగులో ఉన్న ఈ బ్యాగు పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటోలు ముద్రించి మధ్యలో ఇంద్రమ్మ అభయాసం పేరుతో 6 గ్యారంటీలకు సంబంధించిన వివరాలు ముద్రించి రానున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం సెప్టెంబర్ నెల నుంచి అందజేసే సన్న బియ్యంతో పాటు నూతనంగా తయారుచేసిన సంచులను కూడా అందజేసే అందుకు తీవ్ర ప్రయత్నం చేస్తుంది. ఏదేమైనప్పటికీ జిల్లాలో ప్రజలు రేషన్ కార్డుల కోసం 11 ఏళ్ల పాటు నిరీక్షణ చేసిన అనంతరం కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికి అర్హులైన వారికి రేషన్ కార్డు అందజేశారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అవినీతికిగా అడ్డాగా మారిన గరిడేపల్లి తహసీల్దార్ కార్యాలయం

- తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను
- ట్యాంపరింగ్ చేసిన అధికారి దొరికేది ఎప్పుడు
- అవినీతిపై అధికారుల మౌనం ఎందుకు ?
- డబ్బుల కోసం రికార్డుల మాయజాలం
- ఏజెంట్ల డబ్బా కొట్లు తొలగించేది ఎప్పుడు?




గరిడేపల్లి, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రికార్డుల ట్యాంపరింగ్ రెవిన్యూ అధికారులకు, పోలీసులకు సవాల్‌గా మారింది. కార్యాలయంలో జరిగిన రికార్డుల ట్యాంపరింగ్ బహిరంగ రహస్య మైపోయింది.డబ్బు కోసం భూమిపత్రాల మార్పి జరుగుతోందన్న విషయంపై గురువారం కార్యాలయంలోనే బహిరంగంగా చలామణి అవ్వడం కలకలం రేపింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల భూములపై జారీ అవుతున్న ధృవీకరణ పత్రాల్లో తేడాలు తారసపడుతున్నాయి. అధికారులే రికార్డులు ట్యాంపరింగ్ చేసి తప్పుడు పత్రాలు జారీ చేస్తున్నారన్న అనుమానాలు బలపడుతున్నాయి.రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ధరణి, భూభరతి వ్యవస్థలో కూడా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.తప్పుడు సవరించకపోవడం వలన రైతులు భూ యజమానులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. మా భూమిపత్రాలు మాయమవుతున్నాయి. డబ్బులు ఇవ్వకపోతే పనులు జరగడం లేదు. తప్పులు సవరించమంటే రేపు రండి అని సంవత్సరాలుగా తిప్పేకుంటు న్నారని కొంతమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని గార కుంటతండాకు చెందిన రమావత్ నాగమణికి చెందిన కల్మల్‌చెర్వు రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 59లో భూమి 2024లో పహణి తన పేరు మీద ఉండగా, మళ్లీ 2025లో పహణి తీసుకున్నప్పుడు రికార్డులో వైట్ ఫ్లూడుతో తొలగించి మేళ్లచెర్వు మండలం హేమ్లాతండాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి భూక్యా శంకర్ పేరు ఎక్కించడంతో ఒక్కసారిగా ఆమె అవాక్కయ్యారు. విషయంలో బాధితురాలు నాగమణి తహసీల్దార్ ను అడగగా న్యాయం చేయకపోవడంతో జిల్ల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రికార్డుల మాయజాలం బయటపడింది. రికార్డు ట్యాంపరింగ్ విషయంపై బాధితురాలు రమావత్ నాగమణి తహసీల్దార్, పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ముందు ఉన్న జిరాక్స్ సెంటర్‌లను ఏజెంట్లుగా పెట్టుకునపి కళ్యాణలక్ష్మి, రేషన్‌కార్డు, జనన, మరణ ధ్రువీకరణపత్రాలు, భూ సమస్యలపై పలువురు పెద్ద పెద్ద మొత్తంలో డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయం ముందు ఉన్న డబ్బా కొట్లు తొలగించాలని ఆదేశించినప్పటికి నేటి వరకు డబ్బా కొట్లు తొలగించలేదు.ప్రజల పక్షాన నిలబడాల్సిన రెవిన్యూ అధికారులే అవినీతికి పాల్పడుతున్నారని జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రికార్డుల ట్యాంపరింగ్‌పై విచారణ జరిపి బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని మండల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా బాధితురాలు భూమి విషయంపై పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు అట్టి కేసును తిరస్కరించినట్లు మెసేజ్ రూపంలో వచ్చిందని ఫిర్యాదుదారులు తెలిపారు.

# చేతగాని రేవంత్ పాలనలో యూరియా కోసం రైతుకు కాళ్లు పట్టుకునే దుస్థితి

## - సీఎం రేవంత్ చిల్లర రాజకీయాలే - రేవంత్‌ని తిట్టని రైతు లేదు - అన్నదాతలకు అండగా నిలుస్తాం

### - మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : పదేళ్ల కాలంలో దర్జాగా కాలరేగరేసి ఎవుసం చేసిన రైతులు చేతగాని రేవంత్రెడ్డి పాలనలో యూరియా కోసం అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితి నెలకొన్నదని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర తొలిసీఎం హయాంలో ఆరు నెలల ముందే బఫర్ స్టాక్ తెప్పిస్తే సీజన్ మొదలైన ఆరు నెలలు కావస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర నుంచి లేవలేదని మండిపడ్డారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని మీడియాతో సమావేశంలో ఆమె మాట్లాడారు వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే యూరియా అవసరాన్ని అంచనా వేసి, నిల్వలను సిద్ధం చేయడంలో పూర్తిగావ విఫలమైందన్నారు. రైతులకు అవసరమైన యూరియా, ఎరువులపై ఏ ఒక్కరోజు సమీక్షా సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని పరమావధిగా భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి రైతుల సమస్యల తీర్చాలన్న సోయిలేదన్నారు. రాష్ట్రానికి అవసరమైన యూరియా కోటాను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసే ఇండెంట్ను సకాలంలో అందించడంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఘోరంగా విఫలమైందన్నారు. ఊరూరా రైతులు క్యూలైన్లో చెప్పులు, ఆధార్ కార్డులు పెట్టి వర్షంలో తడుస్తుంటే.. సీఎం రేవంత్రెడ్డి ఢిల్లీ బాసుల సేవలో తరిస్తున్నాడని విమర్శించారు. మొన్నటి దాకా విత్తనాల కొరత, సాగునీటి సంక్షోభం, కరెంటు కోతలు, ఇప్పుడు ఎరువుల కొరత దాపురించిందన్నారు. సన్నాసి రేవంత్ పాలనపై రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని ఇవాళ్ల రాష్ట్రంలో రైవంత్ను తిట్టని రైతు లేదని, శాపనార్థాలు పెట్టని మహిళా రైతులు లేరని స్పష్టం చేశారు. ఇంత జరుగుతున్నా వత్తాలేకుండా పోయిన రేవంత్ ఎక్కడున్నాడని రైతుల పక్షాన ప్రశ్నించేందుకు మీడియా సమావేశం ఏర్పాటు చేసిన్నట్లు వెల్లడించారు. ఉన్నట్టుండి ఎరువుల కొరత ఈ స్థాయిలో ఎందుకు ఏర్పడిందో అర్థం కావడం లేదన్నారు. కుట్ర పన్నీ బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రైవేట్ కంపెనీలకు లబ్ది చేకూర్చేందుకు వారి నుంచి భారీగా ముడుపులు తీర్చుకొని యూరియా స్కాంను చేస్తున్నారన్న అనుమానం కలుగుతుందన్నారు. రేవంత్ అనుచరులు కాంగ్రెస్ వ్యాపారస్తులు గోదాంల్లో దాస్తున్నారా? రేవంత్రెడ్డి సమాదానం. చెప్పాలన్నారు. పదేళ్లలోలేని ఎరువుల సమస్యకు మూలం ముమ్మాటికీ రేవంత్ రెడ్డి వైఫల్యమేనని అన్నారు. రుణమాఫీలో ఫెయిల్, రైతుభరోసా, ఉచిత కరెంటు, రైతు భీమా ప్రీమియం చెల్లింపు, రైతుల ఆత్మహత్యలు ఆపడం, రైతులకు సాగునీరు అందించడంలో ఫెయిల్ అయ్యిందన్నారు. గ్రామాలలో కాంగ్రెస్ నేతలను తరిమికొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లడంలో పెట్టిన సమయం, ఎరువులు తెప్పించడంలో పెట్టి ఉంటే ఇవాళ్ల రైతులకు ఇంత దుస్థితి వచ్చేది కాదన్నారు. యూరియా కొరతలో కాంగ్రెస్, బీజేపీ దొందు దొందేనన్నారు. కేంద్రం నుంచి యూరియా కరెక్ట్ నే వస్తుందని, రాష్ట్రానికి వచ్చాక ఏమవుతుందో అని బీజేపీ అధ్యక్షుడు రాంచందర్రావు చెప్పడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. తగినంత యూరియాను సరఫరా చేశామని చెప్పుతున్న కేంద్రం, యూరియా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో సీజన్ కు అవసరమైన 10-12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా చేశామన్నారు. సీజన్ మొదలై నాటి నుంచి కేసీఆర్ 24 గంటల పాటు యూరియా సరఫరాను మానిటరింవ చేసేవారన్నారు. కానీ రేవంత్ ప్రభుత్వం యూరియా సంక్షోభవ పై ఎలాంటి పట్టింపు లేదన్నారు. జూబ్లీహిల్స్ ఫ్యాలెస్లో మొద్దునిద్ర పోతున్న సీఎం ఏ మాత్రం సిగ్గుశరం ఉన్నా గ్రామాల్లో పర్యటించాలన్నారు. యూరియా కొరతను తీర్చేందుకు రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఆమరణ దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద ఎత్తున యూరియా కొరతతో రైతులు అల్లాడుతుంటే మెయిన్ స్ట్రీమ్ మీడియా చూపించడం లేదన్నారు. అన్నదాతల వెంట బీఆర్ఎస్ సైన్యం ఉంటుందన్నారు. సోషల్ మీడియా సైనికులు ఎక్కడిక్కడ కదలిరావాలన్నారు. ఎక్కడ యూరియా కొరత ఉంటే ఫొటోలు తీసి సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, నార్మూల్ మాజీ డైరక్టర్ ఒగ్గు బిక్షపతి, నాయకులు అవుల సాయి, గంగసాని నవీన్, పాండవుల భాస్కర్, బండ బాలసిద్దులు తదితరులు పాల్గొన్నారు.

# ఊరందరి గుడి బడి మాత్రమే

## మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

### - ప్రతి మండల కేంద్రంలో ఏడు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తా

### - మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

### - గట్టుప్పల్‌లో సరస్వతి శిశు మందిర్ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే



మునుగోడు, మేజర్‌న్యూస్ : బడి అంటే గుడి లాంటిదని గ్రామాలలో ఒక్కొక్క కులానికి ఒక గుడి ఉంటుందని, కానీ ఊరందరి గుడి బడి అని మాత్రమేనని మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు నియోజకవర్గం గట్టుప్పల్ మండల కేంద్రంలో సరస్వతీ శిశు మందిర్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి శిశు మందిర్ భవనాన్ని కార్పొరేట్ స్థాయిలో నిర్మించిన ఇడెం శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజ సేవ చేయాలనే తపన ఉండాలని, కుటుంబం కోసమే కాకుండా సమాజం కోసం కూడా ఆలోచన చేసినప్పుడే సమాజంలో పేదరికం అనేది ఉండదన్నారు. భగవంతుడి ఆశీర్వాదం వల్ల ఆర్థికంగా బలంగా ఉండి సమాజానికి సేవచేసే శక్తి ఉండి కూడా సమాజ సేవ చేయకపోవడం నా దృష్టిలో నేరమన్నారు.సహాయం చేయాలంటే వందల కోట్ల రూపాయలు అవసరం లేదని సాయం చేయాలన్న మనసు బుద్ధి ఉండాలి అన్నారు. మొదటి విడతగా ఏడు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ప్రతి మండల కేంద్రంలో అభివృద్ధి చేస్తానని, ప్రభుత్వం ద్వారా కొందరు వ్యక్తుల సహాయ సహకారాల ద్వారా అభివృద్ధి చేసుకుందామన్నారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తూ ఆదర్శం నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, ఘటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, సరస్వతి శిశు మందిర్ పాఠశాల అధ్యక్షుడు ఇడెమ్ శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గాజుల అనిల్, గంజి రాములు, కర్నాటి శ్రీనివాస్, అందే రాము, భావాండ్ల శ్రీనివాస్ ప్రధాన ఆచార్యులు భారత నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగారంలో ఘనంగా ముత్యాలమ్మ తల్లి కళ్యాణోత్సవం బోనాలు

### - శ్రావణ మాసం చివరి వారంతో మండలంలోని పలు గ్రామాలలో బోనాలు



మునుగోడు, మేజర్ న్యూస్ : శ్రావణ మాసం చివరి వారం కావడంతో మండలంలోని పలు గ్రామాల లో గురువారం ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సింగారం గ్రామంలో అంగరంగ వైభవంగా గ్రామ దేవత అయిన ముత్యాలమ్మ తల్లికి అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా వేదమంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి అభిషేకాలు, అలంకారాలు చేసి గ్రామస్తులు కళ్యాణోత్సవం జరిపి, అమ్మవారికి బలిహరణ జరిపారు. అనంతరం డప్పు చప్పులతో ఇంటింటికి వెళ్లగా గ్రామంలోని మహిళలు, యువతులు కొత్త వస్త్రాలు ధరించి తల్లికి బోనాలు ఎత్తుకొని మహిళలు అధిక సంఖ్యలో గ్రామ కూడలి బొడ్రాయి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి సంప్రదాయం ప్రకారం కోట మైసమ్మ, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామ దేవత అయిన ముత్యాలమ్మకి బోనాలు నైవేద్యం సమర్పించి మొక్కలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి చీర సారెలు పెట్టీ కోరిన కోర్కెలు తీర్చాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. డప్పుల వాయిద్యాలు, ఊరేగింపులు, గ్రామం సందడిగా మారింది. భక్తులంతా పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చందూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ లు ఉప్పునూతల రమేష్,జిల్లా లక్ష్మి వెంకటేశ్వర్లు, తాజా మాజీ ఉప సర్పంచ్ వట్టి వెంకట్ రెడ్డి, సోమగోని రమేష్, ఉప్పునూతల చిన్న వెంకన్న, కుంభం దయాకర్ రెడ్డి, కుంభం సురేందర్ రెడ్డి, కట్టుముళ్ళ వెంకట రెడ్డి, ఉప్పునూతల లింగస్వామీ, ఉప్పునూతల భూపాల్, సోమగోని నవీన్, గురిజ సునీల్, ఉప్పునూతల శ్రీశైలం, కట్టుముళ్ళ శేఖర్ రెడ్డి, మునుగోటి వెంకన్న, పనస వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బియ్యం అందజేసిన కేదారి గౌడ్



రాజాపేట, మేజర్‌న్యూస్ : మండల కేంద్రానికి చెందిన పెద్దోళ్ల లచ్చుమ్మ ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు స్వాతి చికెన్ సెంటర్ కేదారి గౌడ్ పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నమిల మహేందర్ గౌడ్, మల్లికార్జున్, బాబు, కనకయ్య, మల్లేశం, రవి, ప్రభాకర్, లక్ష్మణ్, అవినాష్, చింటూ, నాని, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : మిర్యాలగూడ మండల పరిధిలో గురువారం తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయంలో సుమారు 35 సంవత్సరాలు వయసుగల గుర్తు తెలియని వ్యక్తి కొత్తగూడెం జంక్షన్ దగ్గర స్టేట్ హైవే -02 పైన రోడ్డు దాటు తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతని ఎడమ కాలు విరిగిపోయినది. గుర్తించిన స్థానికులు పోలీసు వారికి సమా చారం ఇవ్వగా 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్య లోనే చనిపోయినాడు. ఇతని ఒంటిపై తెలుగు రంగు అంగి, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఇట్టి వ్యక్తి గురించి ఆచూకీ తెలిసిన గుర్తుపట్టిన మిర్యాల గూడ రూరల్ పోలీసులకు సమాచారం అందించవలసిందిగా రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. 8712670189, 8712670151.

# యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

## - చోద్యం చూస్తున్న అధికారులు

## - సిపిఎం మండల కార్యదర్శి రవినాయక్



మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : మిర్యాలగూడ నియోజకవర్గంలో ఎరువుల కొరత రోజు రోజుకు తీవ్రమవుతోందని అవసరమైన యూరియా అందకపోవడంతో రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా తయారై యూరియాల కోసం రోజంతా లైన్లో నిలబడాల్సిన దుస్థితి వచ్చిందని సిపిఎం మండల కార్యదర్శి రవినాయక్ పేర్కొన్నారు. ఇది ముమ్మాటికి పాలకుల వైఫల్యమని కేంద్ర రాష్ట్ర పాలకులు ఒకరిపై ఒకరు నెపం మోపుతూ కాలయాపన చేస్తూ రైతాంగాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నరేంద్రమోడీ తలకెత్తుకున్న విధానాల తాలూకు దుష్పరిణామమే కారణం తప్ప వేరేకాదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎరువులపై రైతులకిచ్చే సబ్సిడీని భారంగా భావించిన కేంద్రం బడ్జెట్ లో నిధులను దిగ్గోసిందని పైగా తన దుర్మార్గం నుంచి రైతుల దృష్టి మళ్లించేందుకు పర్యావరణం, ప్రజల ఆరోగ్యం అనే సుభాషితాలను లంకించుకుందని వారు ఏద్దేవా చేశారు. ప్రకృతి సేద్యం, సేంద్రియ సాగు, జీవ ఎరువుల ముసుగులో రాష్ట్రాల ఎరువుల కేటాయింపులకు కోతలు విధించిందని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రానికి దాదాపు 9.80 లక్షల టన్నుల యూరియా అవసరముండగా 5.32 లక్షల టన్నులే సరఫరా చేసింది. అంటే దాదాపు సగానికి సగం కొరత రైతులను వెంటాడుతొందని దాని ఫలితం ఈ రోజు రైతాంగం పడుతున్న కష్టాలే అని పేర్కొన్నారు. ఈ యేడు ముందస్తు రుతుపవనాల రాకతో రైతులు ఎంతగానో సంతోషడ్డారని ముందుగానే ఖరీఫ్‌కు మొగ్గుచూపారు. అయితే పంటలేసి రెండు నెలలు కావస్తున్నా ఎరువుల సరఫరాలో కేంద్రం మీనమేషాలు లెక్కిస్తోందని తెలిపారు..ఏ విషయంలోనైనా సరే నష్టం జరిగితే ఊరుకోం, ప్రశ్నిస్తాం, నిలదీస్తాం' అని చెప్పిన బీఆర్ఎస్ కూడా కేంద్రంపై నోరు మెదపడం లేదు.అధికారంలో లేమనే ధోరణిలో ప్రతిపక్షం, కేంద్రంతో సంప్రదింపులకు ఒకేగానీ సమరానికి నై అంటున్న అధికారపక్షం, మధ్యలో నష్టపోతున్నది మాత్రం పేద రైతాంగం. ఎందుకంటే, ఢిల్లీలో విన్నపాలు, వినతిపత్రాలతో సరిపెట్టిన రాష్ట్ర సర్కార్ స్పష్టమైన కార్యాచరణకు దిగకపోవడం కూడా రైతులకు పరోక్షంగా నష్టం చేయడం లాంటిదని రాజకీయ పార్టీల విధానాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పిల్లుట్ల సైదులు, రామకృష్ణ, గోవిందరెడ్డి, సైదమ్మ, వెంకన్న, వెంకటేశ్వర్లు, రమేష్, కృష్ణయ్య, శ్రీనివాస్, నాగేశ్వర్రావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

### మునుగోడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# కస్తూరిబా గాంధీ బీసీ బాలికల విద్యాలయాలలో యువ వికాసం



మునుగోడు, మేజర్‌న్యూస్ : లయన్స్ క్లబ్ మునుగోడు ఆధ్వర్యంలో, 320ఈ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మదన్‌మోహన్ రెపాల, క్లబ్ అధ్యక్షుడు ఎంజేఎఫ్ లయన్ నారబోయిన రవి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని కస్తూరిబా గాంధీ బీసీ బాలికల గురుకుల విద్యాలయాలలో "యువ వికాస్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేషనల్ స్పీకర్స్ లయన్ పూర్ణ శశికాంత్, లయన్ దీపికా మామిడిపల్లి మాట్లాడుతూ విద్యార్థినులకు ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, లక్ష్య సాధనపై ప్రేరణాత్మక ఉపన్యాసాలు అందించడంతో పాటు, వారితో ప్రత్యేకంగా ఇంటరాక్షన్ నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు.విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాల పై చర్చిస్తూ, సమయం విలువ, కష్టపడి చదివే అలవాటు, ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడం, టీమ్ వర్క్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులను ప్రేరేపించారు. చదువులో, క్రీడల్లో, సాంఘిక సేవలో ప్రతిభ చూపితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ యువ వికాసం కార్యక్రమం ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోడిస్ట్రిక్ట్ ఛైర్మన్, క్లబ్ ఎక్స్టెన్షన్ కో-చైర్మన్ పీఎంజేఎఫ్ లయన్ యర్రమాద శ్రీనివాస్,వైస్ ప్రెసిడెంట్ మిర్యాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి లయన్ పాలకురి నరసింహ, సెక్రటరీ లయన్ మిర్యాల వెంకటేశం, పాఠశాలల ప్రిన్సిపాల్స్ పుష్పలత, కంకణాల సంధ్య రాణి,లయన్ మిర్యాల శ్రీనివాసులు, నారబోయిన సుధాకర్, రావిరాల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నివ్వ హస్పిటల్ ప్రారంభించిన ఉబ్బు వెంకటయ్య



చౌటుప్పల్, మేజర్ న్యూస్ ః పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో మార్చిన నివ్వ హస్పిటల్ నూతన ప్రారంభొత్సవ కార్యక్రమాన్ని మేనేజింగ్ డైరక్టర్ కుందారపు మల్లేష్ ఏర్పాటు చేశారు.ఈ ప్రారంభోత్సవానికి వ్యవసాయ మార్కేట్ కమిటి చైర్మన్ ఉబ్బు వెంకటయ్య హజరై ఆయన చేతుల మీదగా గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నివ్వ హస్పిటల్ వైద్య సేవలు గత కొన్ని సంవత్సరాలుగా అందిస్తున్న డాక్టర్ చిలువేరు భువనేశ్వర్, సియం లోకేశ్, వైద్యులకు, యాజమాన్యనికి అబినందనలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కేట్ కమిటి ఉప చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ పురపాలక ఉప చైర్మన్ బత్తుల శ్రీశైలం, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఉడుగు మల్లేష్, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ లు మహ్మద్ గౌస్ ఖాన్, పబ్బు శ్రీకాంత్, కాంగ్రేస్ పురపాలక అధ్యక్షులు సుర్వి నర్సింహ, సీనయర్ నాయకులు బత్తుల విప్లవ్, యూత్ కాంగ్రేస్ రాచకొండ భార్గవ్, పాశం సంజయ్ బాబు, సందగళ్ళ సతీష్, మాజీ ఉప సర్పంచ్ పాక చిరంజీవి, మాజీ ఎంపిటిసి మందుల శ్రీశైలం, మాజీ సర్పంచ్ సైదులు, మాజీ యూత్ కాంగ్రేస్ అధ్యక్షులు మాదగోని శేఖర్, బిజేపి నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, పోలోజు శ్రీదర్ బాబు, దిండు భాస్కర్, పబ్బు వంశీ, సిపిఎం నాయకులు బత్తుల శంకర్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గోన్నారు.

# మాల్ సాగర్ హైవే పై ఘోర రోడ్డు ప్రమాదం

## అతివేగం ఇద్దరి యువకుల ప్రాణాలను బలి తీసుకుంది







చింతపల్లి, మేజర్‌న్యూస్ : డివైడర్‌ను ఢీకొని స్నేహితులు ఇద్దరు మృతి చెందిన సంఘటన నల్గొండ జిల్లా చింతపల్లి మండలం మాల్ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన దూటి నరసింహ (23), తల్లోజు సందీప్ చారి(22) ఇద్దరు యువకులు ఇంటికి వెళ్తుండగా అర్ధ రాత్రి మాల్ డివైడర్ పై ఉన్న యాడింగ్ బోర్డ్‌ని అతివేగంగా ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై ఇద్దరు యువకులు అక్కడికక్కడ మృతి చెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్తులు తరలించిన్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికైనా డివైడర్లు పై యాడింగ్ బోర్డులను తొలగించాలని అధికారులను గ్రామ ప్రజలు, వ్యాపరస్తులు కోరారు.

# ఎస్ఆర్ మొబైల్స్ సేల్స్, సర్వీసేస్ ప్రారంభించిన ఎమ్మెల్యే



చౌటుప్పల్, మేజర్ న్యూస్: పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో నూతనంగా ఎస్ ఆర్ మొబైల్స్ సేల్స్, సర్వీసేస్ యజమానులు షేక్ రఫీ, షేక్ షఫీ, షేక్ రశీద్ కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మునుగోడు శాసన సభ్యులు కోమటి రెడ్డి రాజుగోపాల్ రెడ్డి హజరై ఆయన చేతుల మీదగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువత స్వశక్తితో ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కేట్ కమిటి చైర్మన్, ఉప చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ పురపాలక చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ జడ్‌పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రేస్ సమన్వయ కర్త పబ్బు రాజు గౌడ్, మాజీ వైస్ ఎంపిపి ఉప్పు బద్రయ్య, కాంగ్రేస్ పురపాలక అధ్యక్షులు సుర్వి నర్సింహ, సీతారామచంద్ర స్వామి ఆలయ చైర్మన్ బోబ్బిళ్ళ మురళి, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గోన్నారు.

# డిజె సౌండ్ యజమానులకు కౌన్సిలింగ్

అర్వపల్లి, మేజర్‌న్యూస్ ః జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో గల డిజె సౌండ్స్ యజమానులకు డిజె సౌండ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలు, డిజె సౌండ్స్ వాడితే తీసుకునే చర్యల గురించి అర్వపల్లి ఎస్ఐ ఈట సైదులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం డిజె సౌండ్స్ యజమానులను మంచి ప్రవర్తన కొరకు తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేశారు.



సూర్య



# యూరియా కొరత వెనక మంత్రులు, అధికారుల హస్తం

## - కమీషన్ల కోసం రైతులని ఇబ్బంది పెడుతున్నరు

## - ఎరువులను బ్లాక్ మార్కెట్ చేసేందుకే కమిషన్లు

## - మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



నలగొండ ప్రతినిధి, మేజర్‌న్యూస్ : యూరియా కొరత వెనక మంత్రులు అధికారుల హస్తము ఉందని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నారని, ఎరువులను బ్లాక్ మార్కెట్ చేసేందుకే నాటకమాడుతున్నారని ఆయన అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా యూరియా కొరత తీవ్రంగా వేదిస్తుందన్నారు. ఇది ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉందని రైతులు నిద్రాహారాలు మాని చెప్పులు పెట్టుకుని అవస్థలు పడుతున్నారన్నారు. ఎకరానికి 20 వేల పెట్టుబడి పెడితే ఒక్క బస్తా యూరియా మీద దిగుబడి ఆధార పడి ఉందని, కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు.కెసిఆర్ వేసవిలోనే గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి పెట్టేవారు. వ్యవసాయ రంగం పై రెగ్యులర్ రివ్యూ చేస్తూ రైతుల ఇబ్బందులు పడకుండ జాగ్రత్త పడేవాళ్ళం. కనీసం సీజన్‌లో నాలుగు సార్లు రివ్యూ జరిగేదని గుర్తు చేశారు. రైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం ఇబ్బందులు పడడం దారుణం అన్నారు. గతంలో ధాన్యం కొనుగోల్లకు రైతులు ఇబ్బంది పడ్డారు. కరెంట్ కోసం ఇబ్బందులు మొదలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ కాలి పోయి అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో నల్లగొండ మంత్రి ధాన్యం కొనుగోళ్ళ లోను కమిషన్లు తీసుకుని రైతులను గాలికి వదిలేసారని దుయ్యబట్టారు. ఢిల్లీకి 56 సార్లు వెళ్లిన సీఎం కనీసం ఎరువులు తేలేవాఅన్నారు.పోలీసులతో పహారా, లాఠీఛార్జ్‌లతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. నల్లగొండ నియోజక వర్గంలో మంత్రి పూర్తిగా విఫలం చెందారు. ధాన్యం కొనుగోళ్లు అంతే, నీళ్ల పరిస్థితి అంతే, ఇవ్వాళ యూరియా కొరత పైనా అదే పరిస్థితని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు కావాల్సిన యూరియా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వనిదేనని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నానో యూరియా ఉపయోగించుకోవాలి

## - తహసిల్దార్ జి.చంద్రశేఖర్

మునగాల, మేజర్‌న్యూస్ : మునగాల మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్ ఎరువుల దుకాణాన్ని స్థానిక తహసీల్దార్ జి.చంద్రశేఖర్, మునగాల మండల వ్యవసాయ అధికారి బి.రాజు, మునగాల ఎస్సై బి.ప్రవీణ్ కుమార్ గురువారం పరిశీలించారు. మన గ్రోమోర్ సెంటర్లోని ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లను, బిల్ బుక్‌లను, ప్రస్తుతం ఉన్న యూరియా ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించి ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులతో ఎంఆర్పి ధరల గురించి అడుగగా, యూరియాను 266 రూపాయలకే ఇస్తున్నారు, అని తెలియజేశారు. ఆ తరువాత నానో యూరియా వాడకం, ఉపయోగాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మన గ్రోమోర్ సెంటర్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలి

## - ఎస్ఐ ప్రవీణ్ కుమార్



మునగాల, మేజర్‌న్యూస్ : ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరా త్రులు జరుపుకోవాలని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు పాటించవలసిన నియమనిబంధనలు, గురించి ఎస్ఐ. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గణేష్ మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వహకులదే. ప్రతీ మండపం వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నిర్దేశించిన సమయానికి నిమర్జనం పూర్తి చేయాలి. గణేష్ మండపాలు ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తీసుకోవాలి. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలి.రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. డి.జే లు ఏర్పాటు చేయరాదు. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్ ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి.గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శన ను దృష్టిలో వుంచుకోని మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించాలి. గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్ల నీళ్ల ఏర్పాటు చేసుకోవాలి. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం,పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం. పోలీసు తనిఖీలకు సహకరించాలి, పాయింట్ బుక్ ఏర్పటు చేసుకోవాలి. మండపాల వద్ద ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. ఎస్ఐ. ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# 25న బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేద్దాం

## - బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హైద్రాబాద్ ఇందిరాపార్కులో నిర్వహించిన బీసీల సత్య గ్రహం దీక్షకు బీసీలందరూ తరలిరావాలని మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలను రాజకీయ పార్టీలు నేటికి మోసం చేస్తూనే ఉన్నాయి ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు బీసీల గురించి గళం విప్పు తున్నప్పటికీ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు 42% స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల గురించి ఎందుకు చట్టం చేయలేకపోతున్నారని ఆయన అన్నారు బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తూ రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకుంటున్నాయి తప్ప బీసీలకు న్యాయం జరిగే దిశగా ఏ ప్రభుత్వం కూడా శాశ్వత పరిష్కారం తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు బీసీలు అంటే రాజకీయ పార్టీలకు ఓట్లు వేసే ఓటు బ్యాంకు గానే పార్టీలు బీసీలను చూస్తా ఉన్నాయి జనాభాలో అత్యధికంగా ఉన్నటువంటి బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో జనాభాకు తగ్గట్టుగా ప్రభుత్వాలు ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని అన్నారు బీసీలపై కపట ప్రేమ చూపి బిసి లను మోసం చేస్తున్న రాజకీయ పార్టీలకు భిన్నంగా ఈనెల 25న బీసీల కోసం 50 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఇందిరాపార్కులో సత్యాగ్రహ దీక్షకు పిలుపునివ్వడం జరిగింది. ఈ దీక్షకు బీసీ లందరం పార్టీలకు అతీతంగా హాజరై బీసీ రిజర్వేషన్ల సాధనకు ప్రతి ఒక్కరు కలిసి పోరాటం సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి గంగాధర్, బోయిన ఉపేందర్, శ్రీకాంత్, నరేష్, సతీష్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



# మల్లాపూర్ చెరువు వద్ద ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా మల్లాపూర్ గ్రామంలోని చెరువు మత్తడి వద్ద, కట్టమైసమ్మ తల్లికి లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మకు సారే, చీర, పసుపు, కుంకమ్మలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మధ్య కురుస్తున్న వర్షాలకు నీరు చెరువులోకి చేరి అలుగు పారుతుండడంతో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, భరత్ గౌడ్, బంధారపు బిక్షపతి, ముక్కెర్ల మల్లేష్ యాదవ్, మల్లాపురం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లికి పూజలు



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : గురువారం మల్లాపురం ఊరు చెరువు అలుగు పారుతుండడంతో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. అనంతరం గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లెపాటి మాధవులు, బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు ఒగ్గు మల్లేష్, మాజీ వార్డ్ మెంబర్ కర్రె, చంద్రశేఖర్, బిఆర్ఎస్వి మండల ఉపాధ్యక్షులు మోటే శేఖర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పుచ్చుల నరసింహులు, పల్లెపాటి సత్యనారాయణ, పిట్టల ఆంజనేయులు, ఒగ్గు కృష్ణ, గౌడ కరుణాకర్, ఓరుగంటి శ్రీధర్, చల్లూరి సురేష్, ఒగ్గు శేఖర్, కర్రె మల్లేష్, రాజ్ కుమార్, ఒగ్గు శ్రీకాంత్, ఒగ్గు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

## ఊరంతా పండగ వాతావరణం

చింతపల్లి, మేజర్‌న్యూస్ : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తక్కలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ గుడిలో ముత్యాలమ్మ తల్లి విగ్రహం ఏర్పాటు చేశారు. బంధువులు ఆడపడుచులు రాకతో తక్కలపల్లి గ్రామంలో పండగ వాతావరణం నెలకొన్నది. వేద బ్రాహ్మణులచే ప్రతిష్టా కార్యక్రమాలతోపాటు, హెూమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాతలను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ ముద్ధం సత్తయ్య మారయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ. పొగాకు. శ్రీశైలం, మాజీ సర్పంచ్ అనిత నరసింహారెడ్డి, రామస్వామి, ముద్దం .రవీందర్, మేతరి ఏసు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, యూత్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు సాయంత్రము తక్కలపెల్లి గ్రామంలో డబ్బు చప్పుల్లతో వైభవంగా బోనాలు నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించారు. మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందజేత



సూర్యాపేట రూరల్, మేజర్‌న్యూస్ : పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లతో సొంత ఇంటి కల నెరవేరుతుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్త తెలిపారు. గురువారం సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులు 81 మందికి పట్టాలు అందజేయాగ 30 మంది ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 నెలల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సహకారంతో 81 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా,సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు , ఉచిత విద్యుత్తు,నిరుద్యోగ యువత కు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రజా పాలన అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింత అలివేలు కేశాలు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దాసరి నరసయ్య, మాజీ వార్డు సభ్యులు దాసరి శ్రీనివాస్ పోకల వరుణ్ , గ్రామ కార్యదర్శి నరసింహారావు, దుర్గ విజయ్, నాయకులు కాంపాటి రమేష్, వీరమల్ల అంజయ్య, జాల మాణిక్యం, బొడ్డు సైదులు, సూరారపు రమేష్, బొర్రాజు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట రూరల్ :** ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ



లక్ష్యమని ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్.. వేనారెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట మండల పరిధిలోని కాసరబాద, ఎండ్లపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, రేషన్ కార్డులను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ: గత ప్రభుత్వంలో పది సంవత్సరాలు సామాన్య ప్రజలు రేషన్ కార్డు, సొంత ఇల్లు లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని అనేక సంక్షేమ పథకాలకు దూరమయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీలైన 6గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తూ పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలంగాణ ప్రజలు ముద్రవేశారని తెలిపారు. రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని ఎవరు అధైర్య పడుద్దని ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దండి రమేష్. డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుమలరావు. మాజీ ఎంపీటీసీ సరిత అనంతరెడ్డి, పొలగని సైదులు, వెంకటరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుంట్ల మధుసూదన్ రెడ్డి, పంతంగి మల్సూర్, ఉయ్యాల ఆదినారాయణ చందా దశరథ, సుధీర్ పల్స వెంకన్న తదితరులు పాల్గొన్నారు

**చివ్వేంల :** పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,అన్నారు. గురువారం మండల పరిధిలోని బండమిది చందుపట్ల, అక్కలదేవి గూడెం, మోదీన్ పురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, ఆహార భద్రత కార్డులు అందచేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం




పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.ప్రతి గ్రామంలో అభివృద్ధి తగ్గనీయకుండా ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళు అందిస్తామని తెలిపారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రైతును రాజును చేసే దిశగా, పేదవారికి అండగా నిలిచే విధంగా ప్రతి కార్యక్రమం అమలవుతోందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రతి అభివృద్ధి పని, ప్రతి సంక్షేమ కార్యక్రమం ప్రజల కోసమే. ప్రజల ఆశీర్వాదమే ఇందిరమ్మ ప్రభుత్వానికి బలమని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధారావత్ వీరన్న నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినవ్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేములపల్లి వాసుదేవరావు, చింత మల్ల రమేష్,గాయం చంద్రశేఖర్ రెడ్డి, వెన్న మధుకర్ రెడ్డి, నంద్యాల సోమిరెడ్డి, వేముల చిన్న, ఏడుకొండల్, హరికృష్ణ, ముద్ద వెంకన్న, చత్రు నాయక్, లలిత్,మస్తాన్, వీరయ్య, శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సంక్షేమం నిధి ఉపాధ్యాయుల పాలిట వరం

**- టిఎస్‌యుటిఎఫ్**




చింతపల్లి, మేజర్‌న్యూస్ : ఇటీవల అకాల మరణం చెందిన చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరందాసు యాదగిరి సంస్మరణ సభను బుధవారం సాయంత్రం హైదరాబాదు మన్నెగూడలో వారి స్వగృహంలో టీఎస్ యుటిఎఫ్ చింతపల్లి మండల అధ్యక్షులు సిలువేరు. నారాయణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్ మాట్లాడుతూ కుటుంబ సంక్షేమ నిధి అనేది ఒక్కరి కోసం అందరం-అందరికోసం ప్రతి ఒక్కరం అనే నినాదంతో టీఎస్ యుటిఎఫ్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కుటుంబాల సంక్షేమం కోసం 2023 మే 2వ తేదీన ప్రారంబించబడి జూలై 1 నుండి అమలు లోనికి వచ్చింది అని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మధ్యంతరంగా మరణించిన 44 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు 6 లక్షల చొప్పున 2 కోట్ల అరవై నాలుగు లక్షల రూపాయలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు, కుటుంబ సంక్షేమం నిధి అనేది ఉపాధ్యాయులకు వరమని అన్నారు. ఈ సందర్భంగా అమరజీవి తిరందాసు యాదగిరి విద్యారంగానికి, సంఘానికి చేసిన సేవలను కొనియాడారు, అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ఆరు లక్షల రూపాయల కుటుంబ సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కుటుంబ సంక్షేమ నిధి చైర్మన్ ఏం.రాజశేఖర్ రెడ్డి, టిఎస్ యుటిఎఫ్ నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, రాష్ట్ర సాంస్కృతిక కమిటీ కన్వీనర్ నల్ల నర్సింహ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ గేర నరసింహ, జిల్లా కార్యదర్శులు కాశిరెడ్డి కృష్ణారెడ్డి, కోట్ల యాదగిరి, నలపరాజు వెంకన్న, జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ గిరి. యాదయ్య, నాంపల్లి మండల అధ్యక్షులు జింకల సత్యనారాయణ, మర్రిగూడ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు గనిమల్ల. శ్రీరాములు, గోన దేవకుమార్, చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, మర్రిగూడ మండల ప్రధాన కార్యదర్శి పున్న. కృష్ణయ్య, సీనియర్ కార్యకర్తలు, వై.శ్రీరాములు, ఈ.హనుమంతు,చిన్న. వెంకటేశ్వ ర్లు, పరంగి, క్రాంతి, సికిందర్, బి.కృష్ణయ్య, బి.గోవర్ధన్, పి.మురళి, యాదయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు, తిరుపతయ్య, భిక్షమయ్య, కీ.శే.తిరందాసు యాదగిరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రాజకీయ సమావేశంలో పాల్గొన్న హైస్కూల్ ఉపాధ్యాయుడుకు మెమో

మోత్కూర్, మేజర్‌న్యూస్ : పాఠశాలకు వచ్చి సంతకం పెట్టుకొని అనుమతి లేకుండా వెళ్లి రాజకీయ నాయకుల అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న స్థానిక ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడుకు మెమో ఇచ్చినట్టు ఆ పాఠశాల హెచ్ఎం, ఇంచార్జ్ ఎంఈవో తీపిరెడ్డి గోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12న ఉపాధ్యాయుడు ఉప్పలయ్య పాఠశాలకు వచ్చి సంతకం చేసి మోత్కూర్‌లో జరిగిన రాజకీయ పార్టీ నాయకుల అఖిలపక్షం సమావేశంలో పాల్గొన్నారని ఆయనపై వచ్చిన ఫిర్యాదు, ఫోటోలు, వీడియో ఆధారంగా ఆయనకు మెమో ఇచ్చామని ఆ టీచర్ ఇచ్చిన వివరణ ఆధారంగా నివేదికను డీఈవోకు పంపినట్టు చెప్పారు.

# పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

**- ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి**

**- శివర్ల పర్వతాలు యాదవ్, తీదేడు గ్రామ యాదవ్ సంఘం అధ్యక్షులు**



చింతపల్లి, మేజర్‌న్యూస్ : ప్రతి ఒక్కరు పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలి అని తీదేడు గ్రామ శ్రీ మల్లిఖార్జున యాదవ సంఘం అధ్యక్షులు శివర్ల పర్వతాలు యాదవ్ అన్నారు. గురువారం చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో మల్లిఖార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు. తీదేడు గ్రామ ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. ప్రజలు మంచి ఆరోగ్యంతో ఉండేలా చూడాలని ఆయన వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో యాదవ కుటుంబ సభ్యులు, శివర్ల రాములు యాదవ్, మర్ల మల్లయ్య యాదవ్, కొత్తగొల్ల మల్లయ్య యాదవ్, దాసరి వెంకటయ్య యాదవ్, మర్ల రాములు, బట్టు వెంకటయ్య, సిమర్ల కృష్ణ యాదవ్, శివర్ల శంకర్ యాదవ్, ఇడమోని. శ్రీను యాదవ్, ఉడుత శంకర్ యాదవ్, ఇడమోని నాగేష్, దాసరి మల్లేష్, జక్కుల శ్రీను యాదవ్, శివర్ల రమేష్ యాదవ్, దాసరి సాయి యాదవ్, దాసరి ముత్తయ్య, నున్నగోపుల శంకర్ యాదవ్, బట్టు జంగయ్య, మర్ల ఆంజనేయులు, మర్ల శంకర్, కొత్తగొల్ల ప్రవీణ్, శివర్ల ప్రవీణ్, మర్ల శేఖర్, నున్నగొపుల శివ, జక్కుల కొండల్, జక్కుల గిరి, మర్ల రవి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**శోభాయాత్రలకు, డీజే అనుమతి లేదు**

**చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి**



చింతపల్లి, మేజర్‌న్యూస్ : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చింతపల్లి మండల పరిధిలోని 34 గ్రామపంచాయతీలలో గణేష్ ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు పోలీస్ శాఖ రూపోందించిన ప్రత్యేక పోర్టల్లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి కోరారు. పోలీస్ స్టేషన్‌లో మండల వ్యాప్తంగా గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయుటకు ముందస్తుగా సమాచారం తీసుకుంటే మానిటరింగ్ చేయడం చాలా సులభరం అవుతుందని అన్నారు.ఇందుకోసం ప్రత్యేకంగా https://policeportal.tspolice.gov.in/index.htm వివరాలు ఖచ్చితంగా అన్లైన్లో ఉండాలన్నారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి డీజేలకు అనుమతులు లేనందున నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, మండపాల దగ్గర రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు స్పీకర్ల ను వినియోగించరాదని అన్నారు. మండపాల దగ్గర వినియోగించే విద్యుత్ కోసం సంబంధిత శాఖ వారి అనుమతి తీసుకోవాలని,ఎలాంటి సందేహాలు వచ్చిన వెంటనే పోలీస్ శాఖను(డయల్ 100) సంప్రదించాలన్నారు.ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గణేష్ ఉత్స వాలను ప్రశాంత వాతవరణంలో ఆనందోత్సవాల మధ్య శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. చింతపల్లి పోలీస్ స్టేషన్ నెంబర్.8712675858.

# ఎస్ఐ మోహన్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



హుజూర్‌నగర్ రూరల్, మేజర్‌న్యూస్ : ఇటీవల నూతనంగా పట్టణ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన బండి మోహన్‌బాబును గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో, బోకేలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎం.డి అజీజ్‌పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్లూరి హరిబాబు, జక్కుల మల్లయ్య, గల్లా వెంకటేశ్వర్లు, సమ్మెట సుబ్బరాజు,చిన్నం శ్రీనివాస్, కోల మట్టయ్య, ముశం సత్యనారాయణ, రామ్మూర్తి, బొడ్డు గోవిందరావు, చింత్రియాల నాగయ్య, మీసాల శరత్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలి




నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ : మున్సిపాలిటి పరిధితో, మండంలోని గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హుజూర్‌నగర్ డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివోకు వినతపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటికి, గ్రామాలకు నిధులు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడం వలన దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ హుస్సేన్,అంబటి భిక్షం,షేక్ రజాక్, ఉబ్బపల్లి సఐదులు, వడ్లకొండ వెంకటేశ్వర్లు, చందనబోయిన లక్ష్మి,వేమునూరు పావనతి, సయ్యద్ రేష్మ,సిరికొండ శ్యామల,నాగేంద్ర పాల్గొన్నారు.

# కొనసాగుతున్న వందరోజుల ప్రణాళిక కార్యక్రమం

నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ : మున్సిపాలిటి పరిధిలో చేపడుతున్న వందరోజుల ప్రణాళిక కార్యక్రమం గురువారం 81వ రోజుకు చేరింది.మున్సిపాలిటి పరిధిలోని 15వ వార్డులోని అంజలీస్కూల్ నందు తడిపొడి చెత్తపై, ఇంటిలో కంపోస్టు ఎరువు తయారు చేసుకునే విధానంపై మున్సిపల్ అధికారులు వార్డు ప్రజలకు,విద్యార్థులకు అవగాహన కల్పించారు.మున్సిపల్ సిబ్బందిచే రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం జరిగింది. కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాసరావు,మున్సిపల్ కార్యాలయ,వార్డు అధికారులు,కార్యాలయ సిబ్బంది,మెప్మా ఆర్‌పీలు,ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ : పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్ఐ రవీందర్‌నాయక్, ప్రిన్సిపల్ బట్టు మధు అన్నారు. గురువారం మున్సిపాలిటి వారి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్ర మంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలు మంచి వాతావరణాన్ని పొందాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీవేద ఎలక్ట్రికల్స్ ప్లంబింగ్ పేయింట్స్‌ను ప్రారంభించిన మునుగోడు ఎమ్మెల్యే



చౌటుప్పల్, మేజర్ న్యూస్: పట్టణ కేంద్రంలోని తంగడపల్లి ఎదురుగా, వెల్‌కామ్ టీ ప్రక్కన శ్రీవేద ఎలక్ట్రికల్స్ ప్లంబింగ్ పేయింట్స్ యజమాని మాదగొని శ్రీను గౌడ్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా మునుగోడు శాసన సభ్యులు కోమటి రెడ్డి రాజుగోపాల్ రెడ్డి హజరై ఆయన చేతుల మీదగా ప్రారంభించారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్, ఉప చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ పురపాలక చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ జడ్‌పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త పబ్బు రాజు గౌడ్, మాజీ వైస్ ఎంపిపి ఉప్పు బద్రయ్య, కాంగ్రెస్ పురపాలక అధ్యక్షులు సుర్వి నర్సింహ, సీతారామచంద్ర స్వామి ఆలయ చైర్మన్ బోబ్బిళ్ళ మురళి, మాజీ కౌన్సిలర్లు బొడిగె బాలకృష్ణ, సందగళ్ళ సతీష్, బాబా షరీఫ్, కొయ్యడ సైదులు, మాజీ సర్పంచ్ బక్క శ్రీనాథ్, నాయకులు పాల్గోన్నారు.

# డీలర్లు ఎరువులను ఎంఆర్‌పి ధరలకే అమ్మాలి

## – జిల్లా సవిల్ సప్లై అధికారి టి.వెంకటేశం




అడవిదేవులపల్లి, మేజర్‌న్యూస్ : డీలర్లు ఎరువులను రైతులకు ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని జిల్లా సివిల్ సప్లై అధికారి టి.వెంకటేశం ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఎరువుల నిల్వల స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిసిఎంఎస్ నందు యూరియా అందుబాటులో ఉందని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సరిత,రైతులు పాల్గొన్నారు.

# విశాల భారతి పాఠశాలలో బోనాల సంబరాలు



చౌటుప్పల్, మేజర్‌న్యూస్ : చౌటుప్పల పట్టణంలోని శ్రీ గాయత్రి ఎడ్యూకేషనల్ ఇన్స్టిట్యూస్ వారి విశాల భారతి పాఠశాలలో బోనాల ఉత్సవాన్ని గురువారం విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా విద్యార్థులే పోతరాజు వేషాదారులై విన్యాసాలు చేసి ఆకట్టుకునే విధంగా బోనాల ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండేంట్ బీమిడి సుభాష్ రెడ్డి, వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి పాల్గోని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బోనాల ఉత్సవం, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోడెల ఆంజనేయులు, అధ్యాపక బృందం విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గోన్నారు.

# మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ పరామర్శ



తిరుమలగిరి మేజర్ న్యూస్ : మండల కేంద్రంలోని ఇటీవల మరణించిన పలు కుటుంబాలను తుంగతుర్తి బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ పరామర్శించారు. తిరుమలగిరి పట్టణానికి చెందిన ఎల్సోజు రామచారి చిత్రపటానికి పూలమాల వేసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం తాటిపాముల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కారుపోతుల అంజయ్య తల్లి కారుపోతుల నర్సమ్మ ఇటీవల మరణించడంతో వారి చిత్రపటానికి పూలమాల వేసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, శోభన్ బాబు, దూపటి రవి, బర్ల వెంకన్న, షకీల్, ప్రవీణ్, దయా యాదవ్, నరేష్, ఉప్పలయ్య, బాబు, సురేష్ పాల్గొన్నారు.

# సమాజంలో వృద్ధులను గౌరవించడం మనందరి బాధ్యత

## తల్లాడ కేదారి

తుంగతుర్తి మేజర్ న్యూస్ : సమాజంలో వృద్ధులను గౌరవించడం మనందరి బాధ్యత అని తుంగతుర్తి లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు తల్లాడ కేదారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు ఓరుగంటి సరోజనమ్మ అంతయ్య దంపతులు తల్లాడ నారాయణ, బండారి రాములను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని వృద్ధులు మన తల్లిదండ్రులతో సమానమని వారిని గౌరవించడం అవకాశం ఉన్నచో సేవలు చేసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి లైన్స్ క్లబ్ కోశాధికారి గుండగాని రాము, కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, ఓరుగంటి సుభాష్, ఎనగందుల సంజీవ, ఎనగందుల గిరి. వేణు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డు

- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ - ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మోటకొండూర్, మేజర్‌న్యూస్ : పేదల సంక్షేమమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో శ్రీ మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డు అందజేస్తామని రేషన్ కార్డు జారీ నిరంతర ప్రక్రియని స్పష్టం చేశారు. అర్హత కలిగి రేషన్ కార్డులో పేరు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లయితే రెవెన్యూ సిబ్బంది ద్వారా సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులో పేరు నమోదు అవుతుంది తెలిపారు. ప్రభుత్వరేషన్ దుకాణం ద్వారా సన్న బియ్యం ఇచ్చే దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం



కేవలం 18 నెలల్లోనే అన్ని వర్గాల ప్రజలకు అనేక పథకాలను అమలు చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగ దివ్య, ఎండిఓ ఇందిరా కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గంగాపురం మల్లేశం, పార్టీ నాయకులు పచ్చిమట్ల మదర్ గౌడ్, కొంతం మోహన్ రెడ్డి, భూమండ్ల శ్రీనివాస్, జూకంటి మధు, బుగ్గ కొమరయ్య పాల్గొన్నారు.

# మలక్ పేట యశోద హాస్పిటల్‌లో అత్యాధునిక గ్యాస్ట్రో ఎంటిరాలజీ సర్జరీ

డ్యూడేనల్ పర్ఫోరేషన్ రోగి ప్రాణాలు కాపాడిన వైద్య బృందం

వివరాలు వెల్లడించిన యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ గోరు కంటి పవన్, డా.వెంకటేష్ శ్రీపతి




నల్లగొండ ప్రతినిధి, మేజర్‌న్యూస్ : మలక్ పేట యశోద హాస్పిటల్‌లో అత్యాధునిక గ్యాస్ట్రో ఎంటి రాలజీ సర్జరీ ద్వారా డ్యూడే నల్ పర్ఫోరేషన్ రోగి ప్రాణాలను మా వైద్య బృందం ద్వారా కాపాడమని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్ తెలిపారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంటిరాలజీ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి మాట్లాడుతూ డ్యూడెనల్ పర్ఫోరేషన్ అనేది డ్యూడెనమ్ గోడలో,కడుపు తరువాత ఉండే చిన్న ప్రేగు మొదటి భాగంలో, రంధ్రం ఏర్పడినప్పుడు సంభవిస్తుందని డాక్టర్ చెప్పారు.దీంతో ప్రేగులోని పదార్థం కడుపు లోపలి భాగంలోకి లీకై తీవ్రమైన ఇన్ఫెక్షన్(పెరిటోనిటిస్) వస్తుందని, చాలా సందర్భాల్లో డ్యూడెనల్ పర్ఫోరేషన్ ఆకస్మికంగా తీవ్రమైన కడుపు నొప్పితో వస్తుందన్నారు.ఎక్స్‌రే లేదా సీటీ స్కాన్‌లో కడుపులో గ్యాస్ కనిపించడం ద్వారా సులభంగా గుర్తించబడుతుందని, అరుదైన సందర్భాల్లో, ఈ పర్ఫోరేషన్ కాలేయం లేదా ఓమెంటం వంటి చుట్టూ ఉన్న నిర్మాణాల కింద దాగి ఉండవచ్చు, దీంతో గుర్తించడం కష్టమవుతుందని తెలిపారు. దీంతో చికిత్స ఆలస్యమవుతుంది. సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే, డ్యూడెనల్ పర్ఫోరేషన్ విస్తృతమైన ఇన్ఫెక్షన్,సెప్సిస్, మల్టీ-ఆర్గాన్ ఫెయిల్యూర్ వంటి కారణాలతో మరణానికి దారి తీస్తుందన్నారు. అత్యాధునిక గ్యాస్ట్రో ఎంటిరాలజీ సర్జరీ మలక్ పేట, యశోద హాస్పిటల్స్ అద్భుతమైన వైద్య పరిజ్ఞానం, శస్త్రచికిత్సా నైపుణ్యంతో,మా వైద్య బృందం ఒక అరుదైన, దాగి ఉన్న డ్యూడెనల్ పర్ఫోరేషన్ కేసును గుర్తించి, విజయవంతంగా 22 సంవత్సరాల యువకుని ప్రాణాలను కాపాడగలిగామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మర్రిగూడ కు చెందిన బుర్ర రంజిత్ బీటెక్ విద్యార్థి (రోగి) మూడు రోజులుగా కడుపు ఉబ్బరం, జ్వరం, విరేచనాలతో బాధపడుతూ ఓ స్థానిక ఆసుపత్రుల్లో ఆక్యూట్ గ్యాస్ట్రో ఎంటరైటిస్, పైలోనెఫ్రైటిస్, పారాలిటిక్ ఐలియస్ అనుమానాలతో చికిత్స పొందుతున్నాడు. శ్వాసలో ఇబ్బంది పెరగడంతో, రంజిత్‌ను స్థానిక హాస్పిటల్ డాక్టర్ హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రిఫర్ చేశారు.పరీక్షలో రోగి అప్రమత్తంగా, ఆరోగ్యకరంగా కనిపించడంతో, ప్రాణాధార సంకేతాలు : పల్స్ 118 బీట్లు/నిమిషం,బీపీ 100/70 ఎంఎంహెచ్‌జి, శ్వాస రేటు 28 సార్లు/నిమిషం. కడుపు పరీక్షలో అన్ని భాగాల్లోనూ ఉబ్బరం,నొప్పి కనిపించిందని వైద్య బృందం తెలిపింది. రెండు రోజుల క్రితం చేసిన సీటీ స్కాన్‌లో స్వల్ప ద్రవం, కుడి మూత్రపిండం చుట్టూ వాపు కనిపించినప్పటికీ ఖచ్చితమైన నిర్ధారణ కాలేదని, యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తిరిగి ఐవి,మౌఖిక కాంట్రాస్ట్‌తో చేసిన సీటీ స్కాన్‌లో,డ్యూడెనమ్ రెండవ భాగం గోడలో 1X1 సెంటీమీటర్ల రంధ్రం,కుడి మూత్రపిండం పైభాగంలో కాంట్రాస్ట్ చేరడం, కుడి వైపు ప్లూరల్ ఎఫ్యూషన్ కనిపించాయనిన వైద్యులు తెలిపారు. తక్షణమే అత్యవసర లాపరోటమీ చేసి,ఆపరేషన్‌లో పర్ఫోరేషన్ కాలేయ మూలమోంచు,ఓమెంటం కింద దాగి ఉండి,స్థానిక బిలియరీ పెరిటోనిటిస్‌కు కారణమైందనిన, శుద్ధి (లావేజ్) చేసిన తరువాత,పెడికిల్డ్ ఓమెంటల్ పాచ్‌తో రంధ్రాన్ని మూసి,ఆపరేషన్ తరువాత లీక్ వచ్చే ప్రమాదం ఉన్నందున ఫీడింగ్ జెజునోస్టమీ ఏర్పాటు చేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి వేగంగా కోలుకున్న మొదటి రోజుకే వెంటిలేటర్ నుంచి బయటపడ్డాడు, రెండవ రోజుకే నడిచాడు, మూడవ రోజు నుండి ఎఫ్‌జె ద్వారా ఆహారం మొదలుపెట్టాడు. నాలుగో రోజు డ్రైన్‌తో డిశ్చార్జ్ అయ్యాడు, వారం తరువాత మౌఖిక ఆహారం ప్రారంభించాడు, మరో రెండు రోజుల తరువాత డ్రైన్ తొలగించబడింది, ఆరు వారాల తరువాత ఎఫ్ జెను తొలగించారు. ఈ కేసు అత్యంత సవాలుతో కూడిందని, పర్ఫోరేషన్ దాగి ఉండి, సాధారణ రేడియాలజీ లక్షణాలు కనిపించలేదు. సకాలంలో ఇమేజింగ్, ఖచ్చితమైన నిర్ధారణ, సమన్వయపూర్వక శస్త్రచికిత్స రోగి ప్రాణాలను కాపాడటంలో కీలకం అయ్యాయి. రోగి తిరిగి ఆరోగ్యాన్ని పొందినందుకు ఆనందంగా ఉందని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రి ఎంటిరాలజీ వైద్య నిపుణులు డా.వెంకటేష్ శ్రీపతి తెలిపారు. హైదరాబాద్, మలక్ పేట యశోదా ఆసుపత్రిలో కాకుండా యశోదా అసుపత్రి అన్ని శాఖల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు, వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని మలక్ పేట యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్,యూనిట్ హెడ్ కె.శ్రీనివాసరెడ్డి,జనరల్ మేనేజర్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. మరిన్ని వివరాలకు ఏ.వాసు కిరణ్ రెడ్డి ని సంప్రదించాలని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి

- మున్సిపల్ నూతన కార్యాలయ భవనానికి నిర్మాణానికి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని ఆలేరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మున్సిపల్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్టలో మూడు కోట్ల 20 లక్షల రూపాయలతో నూతన మున్సిపల్ కార్యాలయ భవనం అన్ని హంగులతో నిర్మాణం జరగనుందని అన్నారు. మున్సిపల్ కార్యాలయాల భవనాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిదుర కేటాయిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాళ్లకు పెద్ద ఎత్తున అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతున్నాయని, కష్టపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు శాలువాలతో, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : మత్స్యకారుల అభివృద్ధికి వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ఎప్పటికప్పుడు వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని ప్రభుత్వ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం యాదగిరిగుట్టలో ఫిషర్మెన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు పెద్ద ఎత్తున వారి సంక్షేమానికి నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కృతజ్ఞత సభను నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని చెరువుల్లో చేప పిల్లలు పెంచడానికి ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిందని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ప్రతి చెరువును పెద్ద ఎత్తున గోదావరి జలాలతో నింపి చేప పిల్లలను వదిలేయమని అన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి, ముదిరాజుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వీరిని అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ మచ్చల శాఖను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సహకారం అవసరమున్న తాము పెద్ద ఎత్తున కృషిచేస్తూ అండగా ఉంటామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఫిషర్మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా జానకిరాములు ఆయనను ఘనంగా శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఆ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మత్స్యకారులు స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.